కథా నిలయం
శ్రీకాకుళం

# వక్రతనువు

ఎన్నాళ్ళగానో కలలుగన్న నీ మూర్తి! ఎన్నాళ్ళ నుంచో నీ కథలు విని విని మైమరచి మధురంగా ఊహించుకున్న నీ మూర్తి! ఇన్నాళ్ళకు యివ్వాళ నా కన్నులఎదుట! ఇది నిజమా! కలా! భ్రమలో చెదరిన నాకన్నులు కాంచిన నీ రూపం! నిజంగా నీవే నా ఎదట ఉన్నావా? ఊహలలో ప్రతిక్షణం నిన్నేచూచే నా కన్నులు భ్రమనే నిజమనుకున్నాయా?

సౌందర్యానికి, సరసత్వానికి నిలయమైన మీ బృందావనికి దూరంగా, మౌనంగా, జడంగా మసలే మా మధుర! ఇక్కడ వెన్నెలలో చిరుతరంగాలతో ఆవులిస్తూ, కలకంటున్న తపస్వినిలా యమున పవళించి లేదు! పొగడలు పున్నాగలు విరబూచి పరిమళించే చల్లని కోనలు లేవు! అర్ధరాత్రి అమూచితంగా వినిపిస్తూ, లోకాలను పరవశింపజేసే వేణునాదం లేదు! మురళీగానానికి మైమరచి నిలువలేక పరుగులెత్తే ఆలమందలు లేవు. ఉన్నట్టుండి ఉడికిస్తూ వినిపించే నీ మువ్వల మ్రోతలు లేవు. మువ్వలమ్రోతకు బెదిరి చేతి కడవలు జారవిడచి, చీరకొంగులు విదల్చి, అన్నీ మరచి, అడుగులు ముందుకువేసే వల్లవకాంతలు లేరు.

మాది రాక్షసరాజ్యం! నోరు మెదపడానికి భయపడే మౌనజీవితం! లోలోపలైనా మధురమైన ఊహలు నిలుపుకోలేము! నీ పేరు స్మరించలేము! అది మా రాజు శాసనం!

యాంత్రికంగా ఉదయం ప్రారంభించిన పగటికాంతి నిర్జీవమైన ఎండుటాకుల్లావున్న మావూరి పరిసరాలలో కళావిహీనంగా ప్రసరించి ప్రసరించి, సంజవేళ - మనసుకు భయాన్ని కలిగిస్తూ మాయమవుతుంది. కారుచీకటిలో ఘడియ ఘడియకూ కాపలావాళ్ల కరకు గర్జనలు వినిపిస్తాయి. భయంతో ఒదిగిన బ్రతుకు మరింత వక్రంగా ముడుచుకు పోతుంది. దిగులుతో, పీడకలలతో మా రాత్రి గడచి పోతుంది. మద్యంతో మత్తెక్కిన శరీరాలు మళ్ళా అక్కడక్కడా అందవికారంగా ఆవులిస్తాయి.

ఈ మహానగరంలో, మారుమూల మనిషిజాడ లేని చోట నా బ్రతుకు! వక్రంగా ముడుచుకుపోయిన తనువు! నేలకు జానెడుకన్నా ఎదగని మేను! ప్రజలు పరిహాసంగా పెట్టుకున్న పేరు త్రివక్ర! వక్రమైన తనువులో మనసున మధురమైన ఊహలు! నిలువనీయని మమతలు! అలలు అలలుగా కమ్ముకునే ఆశలు!

రాక్షసునికి లేపములు కలపడం నా పని. సుకుమారమైన ఈ లేపముల సువాసన అతనిని ఆకర్షించదు! ముట్టుకుంటే కందిపోయ్యే పుష్పాల సౌకుమార్యం మొరటువేళ్లకేమి తెలుస్తుంది! చేతులు నొప్పికలిగేటట్లు చందనం తీస్తాను.

అది మోసుకువెళ్ళి అతనిక్రమాల పెడతాను. అతడు దానిని చూడడు. అయినా నేను చేయక తప్పదు.

నిజంగా నేను అతనికోసమే ఈ చందనం తియ్యడం లేదు. అలాఅయితే ఒక్కరోజయినా చెయ్యలేను. ప్రతి నిత్యము ప్రతి వస్తువులో నీ చిరునవ్వునే చూస్తున్నాను. ప్రతిపని నీ కోసమే చేస్తున్నాను. పువ్వులు ఏరుతున్నాను. కడుతున్న ప్రతిమాలా మనసులో నీకే అర్పిస్తున్నాను. ఈ బ్రతుకు ఇలా నీ కోసమే అంకితమై జరుగుతోంది. లేపములు మోసుకొని, రాచబాటలో సాగి వెళ్ళేటప్పుడు ముకుళించిన నా శరీరం నిరాశతో మరింత వక్రమైనప్పుడు నా కన్ను లలో నీరు నిండి నేలకు రాలేటప్పుడు ఆ కన్నీటి బిందువు లలో చిరునవ్వుతో నీ ముఖమే కనబడుతుంది. ఆగకుండా అడుగులు ముందుకు సాగుతాయి!

ఎన్ని కథలు విన్నాను! నీ కథలు పిల్లతెమ్మెరలై మాటి మాటికి మనసుకు హాయినిస్తాయి! వెన్నల దొంగవు! గోగణపాలకుడవు! వల్లవకాంతల వల్లభుడవు! కొండగొడుగు నెత్తిన గోపాలచక్రవర్తివి! మురళీగాన లోలుడవు! నంద గోపు నింట వెలసిన సుందరుడవు!

నీ నీల తను రుచి, నీసిగలో కదలియాడే నెమలి పింఛము, నీ కాలి చిరుగజెలు, కన్నులలోని కొంటెతనం, పెదవులపై చిరునవ్వు, నిన్ను చూడకనే నీ రూపు మదిలో వదలక నిలచింది. ఏవైపు చూచినా నీ రూపమే! ఏ క్షణం తలచినా తలపులో నీ కథలే! క్షణమే యుగంగా, బ్రతుకే

బరువుగా, నిరాశ లోపల నిదురపోక పెనగులాడే ఆశారేఖ ఎదురు తెన్నులు చూచేది నీ రాక కొరకే!

ఇవ్వాళ నోములు ఫలించాయి. మూడురోజులుగా మా ఊరు ముచ్చటపడుతోంది, నీవు వస్తావని! ధనుర్యాగానికి నీవు వస్తావన్న వార్త ఆ నోట ఆ నోట అందరి ఇళ్లల్లో కమ్ముకుంది. నిద్రపోతున్న మాఊరు ఒక్కసారి మేల్కొన్నది. జడత్వం పొందిన మా ఊరు ఒక్కసారి చైతన్యంతో కదలిపోయింది. ఎండిపోయిన హృదయాలు అమృతధారలకు ఎదురు చూచాయి! చూడదగిన వస్తువులేక నీరసించిన కన్నులు, నీ రాకకోసం తహతహలాడాయి.

ఇంత ఉత్సాహంలోను నాలో ఏమూలో నిరాశ! నీవు వస్తే మాత్రం, ఈ మహానగరంలో ఈకోలాహలంలో నిన్ను ఎలా చూడగలను! ఎక్కడ చూడగలను! జనసందోహాన్ని ముందుకు త్రోసుకురాగల శక్తి నాకులేదు. ఈ మాగుమూల, నా కుటీరాన్ని వెతుక్కొని నీవు రావు! నీవు నాకోసమని రాలేదు. కార్యాంతరమగ్నుడవైన నీకు నా వేదన ఎలా తెలుస్తుంది. నా ఉనికియే నీ వెరుగవు! ప్రతి క్షణం ఈ వక్రతనువు నీకోసం పరితపిస్తోందని నీవెలా ఊహించగలవు!

అయినా గుంపులు గుంపులుగా ప్రజలు నిన్ను చుట్టుకుంటారు. ఉద్రేకంతో, ఉత్సాహంతో, క్షణ విరామం లేకుండా, వారినివదలి నీవుమాత్రం ఎలా రాగలవు?

ఎన్నో ఏళ్ళుగా తపించి తపించి, ఎదురు చూచిచూచి నోములపంటగా ఒక్కరోజు నీవు వస్తే ఒక్క క్షణమైనా నిన్ను చూడలేక నీవు మళ్ళా నాకు కనుమరుగైతే, నీ త్రోవన నీవు వెళ్ళిపోతే, ఆ నిరాశ, ఆ దుఃఖము ఎలా భరించను! అన్నివైపుల అందరిలో ఆనందము అలముకుంటూవుంటే నాలో లోలోపల నిరాశ కృంగతీస్తోంది.

ఇవ్వాళ ఉదయం నగరంలోని సంరంభంతో నాకు సంబంధం లేనట్టుగా, అణగారిన హృదయంతో, నా విధి నేను నిర్వహించడానికి, మౌనంగా మామూలుగా రాజమార్గాన నడచిపోతుంటే, అనుకోకుండా నీవు నా ఎదుట నిలబడితే, సంభ్రమముతో నామేను పులకించి పరవశమైన క్షణంలో ఈ వక్రమైన తనువునుచూచి నీవు రోతచెందుతావేమోనన్న భయంతో ఇంకా కుంచించుకుపోయి వణికిపోతున్న క్షణంలో, నీవు చేయి ముందరకుచాపి నా చేతిలోని లేపములు అందుకుంటే, ఆప్యాయంగా మేనికి అలముకుంటే, నా కన్నులలో నీరు జలజలా రాలింది! నీలో ఇంత దయ వున్నదనుకోలేదు. నా బ్రతుకు, నా శ్రమ ఇలా చరితార్థమవుతాయనుకోలేదు. నా నిరీక్షణ ఇలా మనోహరంగా అంతమవుతుందనుకోలేదు.

నా చుబుకము స్పృశించి జాలితో నీవు నా ముఖాన్ని పైకెత్తినప్పుడు, నీస్పర్శకు సంతోషంతో ఉప్పొం

గిన నా మేను విరిసిన పూవులా విలాసంగా విప్పారింది. నీ వాత్సల్యంలో నా తనువు సౌందర్యం నింపుకొంది అందమైన ఆ ఆకారం చూడగానే ఆనందం అవధి దాటింది. హృదయాల్లో కృతజ్ఞత వెల్లివిరిసింది. ఆ రూపంలో నీ చెంత నిలబడగానే ముముసిగ్గు తెరలు తెరలుగా మొలకలెత్తింది. నిన్ను సూటిగా చూడలేక ముఖం వాల్చుకున్నాను.

ఆప్యాయంగా. అతి ప్రేమతో “ఏం కావాలి” అని నీ వడిగితే, ఆవేగంవల్ల నానోట బదులు రానేలేదు. మనసు మనోజ్ఞరాగంతో నిండిపోయింది. మాటచెప్పలేక మౌనంగా నిన్ను చూశాను. నా కళ్లలో నా కోర్కె ప్రతిఫలించి నీకు కనిపించింది “వచ్చినపని కాగానే, నీ మందిరానికి వస్తాను” అని నీ వనగానే, ఆ అపరిమితమైన కరుణకు ఆనందంతో నమస్కరించాను.

ఎన్నో ఏళ్ళుగా నిర్జీవంగావున్న ఈ కుటీరాన్ని, అందంగా అలంకరించి నీకోసమే ఎదురుచూస్తున్నాను. ఏ క్షణమైనా నీ అడుగుజాడ వినిపించవచ్చుననే ఆశతో వాకిలివైపే చూస్తున్నాను. ఈఆఖరుక్షణాన ఏదో భయంవేస్తోంది. ఇది అనుగ్రహమేనా! ఇది ప్రియమైన వరమేనా! ఈరాత్రి అనురాగంతో ఒక్కక్షణం నన్ను కౌగలించి నీ త్రోవన నీవు పోతే, బ్రతుకంతా నీకై పలవిస్తూ నేను మనగలనా! ఒక్కక్షణం నీఒడిలో పులకరించిన మేను. నీకోసమే పరితపించి

పరితపించి కృశిస్తే, ఒక్కక్షణం నీ మృదువైన మాటలువిని పరవశించిన వీనులు నీ పలుకుతేనెకోసమే పలవరిస్తే, నీరూపు హత్తుకున్న హృదయం నిన్ను మరువలేక, నిన్ను చూడలేక ప్రతిక్షణం దహిస్తే, బ్రతుకంతా ఈ దుఃఖము ఎలా సహించను: ఈ వియోగంలోనే దిక్కులేక ఎలా దినములు గడపను! ఇది ఆప్యాయతకాదు, ఇది నిర్దయ! ఇది వరం కాదు. ఎన్నటికి విముక్తిలేని శాపం!

నా దైన్యాన్నిచూచి నీవు నాదగ్గర నిలువలేవు. నీ కొరకై పలవించే వేయిగొంతుల పిలుపులు విని నీవు పోక తప్పదు. నా హృదయంలో నివసించేది నీవుమాత్రమే, నాకు వేరు లోకమేలేదు. సమస్త ప్రపంచం నీవే! నీ హృదయంలో సమస్త ప్రపంచం నివాసం ఏర్పరచుకుంది. ప్రపంచమంతా నీవే! అనంతకోటి మానవుల ఆర్తనాదంవిని నీవు ఆర్తి చెందక తప్పను. నీ అనుగ్రహం కట్టలు తెంచుకుని అన్నివైపులా ప్రవహించక తప్పదు. నామీద ఒక్కక్షణం దయ చూపగలవు, అవధిలేకుండా నాచెంతనే వుండలేవు!

ఈరాత్రి ప్రేమతో నీవు నన్ను కౌగలించిన క్షణమే, నా తనువు శిథిలమై మాయమైతే, నా ఆత్మ నీలో కలసి పోతే ఈ జీవితానికి అదే పరమావధి. ఇక నీకు, నాకు ఎన్న

టికి వియోగమేలేదు. బ్రతుకు ఫలిస్తుంది! శాశ్వతమైన ఆనందం లభిస్తుంది. పతితపావనుడైన పరమాత్ముడు చెంతకువచ్చి వరం కోరుకొమ్మంటే జన్మరాహిత్యం కోరుకోలేక, క్షుద్రమైన కోరిక కోరుకున్నాననే అపప్రథ ఇంక నాకు తొలగిపోతుంది.

ఇదే అనుగ్రహం! ఇదే వరం! అవధిలేని అనురాగం!